సాక్షి పశ్చిమగోదావరి

సోమవారం । 9 । డిసెంబర్ । 2024



అరకు కాఫీ గుబాళింపు

అరకు కాఫీ ఇప్పుడు బుట్టాయగూడెంలో అందుబాటులోకి వచ్చింది. ఐటీడీఏ గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో సూపర్ బజార్, కాఫీ హాబ్‌ను ఏర్పాటు చేశారు. 8లో



భార్యపై హత్యాయత్నం

భార్యపై కత్తితో భర్త దాడి చేసిన ఘటన జంగారెడ్డిగూడెంలో జరిగింది. బాధితురాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, భర్తను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 8లో




వరిని కాపాడుకుందాం ఇలా..

అల్పపీడనంతో వర్షాలు పడే అవకాశం ఉందన్న హెచ్చరికలతో కోతకు వచ్చిన వరిని కాపాడుకునేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. 8లో

న్యూస్‌రీల్

16 నుంచి ధనుర్మాసోత్సవాలు ప్రారంభం



ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రంలో ఈనెల 16న ధనుర్మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆ రోజు సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమయ్యే ఉత్సవాలు వచ్చే నెల 15 వరకు వైభవంగా జరుగనున్నాయి. తిరువీధి సేవలు ఈ నెల 17 నుంచి ప్రారంభమవుతాయి. ఉదయం స్వామివారు, ఉభయ దేవేరులతో కలిసి క్షేత్ర పురవీధుల్లో అట్టహాసంగా ఊరేగనున్నారు. నిత్యం ఆలయంలో తెల్లవారుజామున జరిపే సుప్రభాత సేవను ఈ నెల 17 నుంచి, వచ్చే నెల 14 వరకు రద్దు చేసి, వాటి స్థానంలో తిరుప్పావై సేవలను నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. జనవరి 13న గోదాదేవి కల్యాణం, 15న కనుమ ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు.

అక్రమ నిర్మాణాలపై అభ్యంతరం



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా ఆదివారం రాత్రి అక్రమ నిర్మాణాలు కొనసాగించారు. జనసేన నాయకుడి అండతో కొందరు గోతులు తవ్వేందుకు జేసీబీలు, ట్రాక్టర్లు తీసుకొచ్చారు. ఇటీవల కలెక్టర్ ఆదేశాలతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో లేఖర్లు ఏర్పాటు చేసుకున్న పాకలు, బెంచీలను రెవెన్యూ అధికారులు తొలగించారు. తిరిగి నిర్మాణాలు చేపట్టడంపై స్థానికులు, ప్రజా సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు 2,560 మంది హాజరు

భీమవరం: 20024-20025 విద్యా సంవత్సరానికి నేషనల్ మీన్స్ కమ్-మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్‌ఎంఎస్ఎస్) పరీక్షకు ఆదివారం 2,560 మంది విద్యార్థులు హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి నారాయణ ఆదివారం తెలిపారు. పరీక్షకు మొత్తం 2,683 మంది దరఖాస్తు చేసుకోగా 123 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు.

పరీక్షకు 2,566 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వచ్చే విద్యా సంవత్సరానికి జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్) ఆదివారం జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్లలో ఏర్పాటు చేసిన 12 పరీక్ష కేంద్రాల్లో ప్రశాంతంగా నిర్వహించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు మొత్తం 2,788 మంది దరఖాస్తు చేయగా వారిలో 2,566 మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. మరో 222 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు.

ఉపాధ్యాయుడి బదిలీపై ఆరోపణలు

ద్వారకాతిరుమల: స్థానిక ఎంపీయూపీ పాఠశాలలో గత నెలలో విద్యార్థులను చితకబాదిన ఉపాధ్యాయుడు ముత్యాలరావును కామవరపుకోట మండలం జలపవారిగూడెం పాఠశాలకు బదిలీ చేస్తూ డీఈవో ఎం.వెంకట లక్ష్మమ్మ శనివారం ఉత్తర్వులిచ్చారు. తమ బిడ్డలను కొట్టి, విద్యార్థులను బూతులు తిడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్న ఉపాధ్యాయుడిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోకుండా బదిలీ చేయడాన్ని బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు తప్పుపడుతున్నారు. విద్యాశాఖాధికారులు ఇంత ఉదాసీనంగా వ్యవహరించడానికి ముడుపుల చెల్లింపులే కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉపాధ్యాయుడి చేతిలో గాయాల పాలైన విద్యార్థులను చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్చగా, అక్కడ మెడికో లీగల్ కేసు నమోదు చేసినా.. పోలీసులు ఉపాధ్యాయుడిపై కేసు కట్టకపోవడం దారుణమన్నారు. స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్ళినా న్యాయం జరగడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముత్యాలరావు గతంలో పని చేసిన పాఠశాలల్లో కూడా ఇదే తరహాలో విద్యార్థులను కొట్టాడని ఫిర్యాదులు ఉన్నాయి. విద్యార్థులను కొట్టడం వాస్తవమేనని ఎంఈవో నివేదిక ఇవ్వగా.. తాను విద్యార్థులను కొట్టలేదని, మందలించానంటూ ముత్యాలరావు వివరణ ఇచ్చాడని డీఈవో ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ధరాభారాలు.. ఇంకెన్నాళ్లు?

నిత్యావసరాలు, కూరగాయల ధరలు సామాన్యుడికి చుక్కలు చూపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇదే పరిస్థితి ఉన్నా.. ధరల నియంత్రణకు చర్యలు మాత్రం శూన్యం. మొక్కుబడిగా ప్రత్యేక కౌంటర్‌లు అంటూ కలరింగ్ ఇచ్చారు. అయితే నిర్వహణ సరిగా లేక ఆ కౌంటర్‌లు మూతపడడంతో పేద, మధ్య తరగతి ప్రజల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది.

– భీమవరం(ప్రకాశం చౌక్)



కూరగాయల (కిలో)	ధర(రూ.లలో)
ఉల్లిపాయలు	60-70
బంగాళదుంపలు	50-60
వంకాయలు	60-80
బెండకాయలు	40 -60
బీరకాయలు	60-80
టమాటా	40-60
క్యారెట్	60-80
అల్లం	60-70
నిత్యావసరాలు(కిలో)	**ధర(రూ.లలో)**
బెల్లం	60-70
చింతపండు	130-140
వెల్లుల్లి	550-600
సన్‌ఫ్లవర్ నూనె	150-160
వేరుశనగ నూనె	140-200
పామాయిల్	125-140

- రోజురోజుకీ పెరిగిపోతున్న నిత్యావసరాల ధరలు
- కొండెక్కి కూర్చున్న కూరగాయలు
- రూ.7.50 నుంచి రూ.8 పలుకుతున్న కోడిగుడ్డు
- ధరల నియంత్రణపై చేతులెత్తేసిన ప్రభుత్వం
- మరోపక్క పనులు సక్రమంగా లేక అల్లాడుతున్న జనం
- పోషణ భారంగా మారిన పేద, మధ్యతరగతి కుటుంబాలు
- పథకాల హామీలు అమలు చేయని కూటమి సర్కారు

ఈ ఏడాది జూలై నుంచి కూరగాయల ధరలు పెరగడం తప్ప తగ్గడం లేదు. జూలై నుంచి సెప్టెంబరు వరకు వర్షాల కారణంగా కూరగాయల ధరలు పెరిగితే తర్వాత కార్తీక మాసం పేరుతో ధరలు పెరిగాయి. కార్తీక మాసం వెళ్లాక కూడా కూరగాయల ధరలు దిగి రావడం లేదు. ఏ కూరగాయ అయినా కేజీ రూ.60 నుంచి రూ. 80 మధ్య ఉంది. ఉల్లిపాయ కేజీ రూ.70 నుంచి రూ.80 పలుకుతూ.. ఉల్లిపాయను కోయకుండానే కన్నీళ్లు తెప్పిస్తోంది.

కిరాణా సరుకులు కొనాలంటే షాక్

కూరగాయల ధరలతో పోటీగా కిరాణా సరుకులు దడ పుట్టిస్తున్నాయి. పప్పులు, నూనె, బియ్యం, పంచదార, చింత పండు ఇలా ఏదైనా పెరగడమే తప్ప తగ్గడం లేదు. ఏ సరుకైనా కేజీ రూ.150 నుంచి రూ.200 రూపాయలు మధ్య ఉంది. ముఖ్యంగా మంచి నూనె ధరలు గత కొన్ని నెలల్లో దారుణంగా పెరిగాయి. సన్‌ఫ్లవర్ కిలో రూ.160 ఉండగా వేరుశనగ నూనె ధర రూ.200కు చేరింది. నలుగురు ఉండే కుటుంబానికి వారం రోజులకు కూరగాయలు, కిరణా సరకులకు రూ.2 వేలకు పైనే ఖర్చు చేయాల్సి వస్తోంది. నెలకు దాదాపు రూ. 8 వేలు ఖర్చవుతుంది.

తూతూ మంత్రంగా ప్రత్యేక కౌంటర్లు

కూటమి ప్రభుత్వం కూరగాయలు, నిత్యవసరాల ధరల నియంత్రణలో విఫలమైంది. నిత్యావసరాల ధరలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా చర్యలు మాత్రం శూన్యం. కంటి తుడుపు చర్యగా నియోజకర్గానికి ఒక ప్రత్యేక కౌంటర్ పెట్టి కొద్ది మొత్తంలో ఉల్లిపాయలు, నూనె ప్యాకెట్లు పెట్టి సరిపెట్టింది. ఈ ప్రత్యేక కౌంటర్లు ఎక్కడ పెట్టారో కూడా తెలియదు. మండలానికి ఒకటి చొప్పున కూడా పెట్టకపోవడంతో ప్రజలు ధరల దోపిడీకి గురవుతున్నారు.

ఇలాగైతే సామాన్యుడి పరిస్థితి ఏంటి ?



రోజురోజుకు పెరుగుపోతున్న నిత్యావసరాలు, కూరగాయల ధరలు చూస్తే భయం వేస్తుంది. పెరుగుతున్న ధరల్ని సామాన్యుడు భరించడం కష్టం ధరలు నియంత్రించాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఆరు నెలలగా నిత్యావసరాల ధరలు దారుణంగా పెరుగుతూనే ఉన్నాయి. ఇదే విధంగా ఉంటే సామాన్యుడు ఎలా బతకాలి?

– పాలవెల్లి మంగ, భీమవరం

ధరలను నియంత్రించాలి



కూరగాయలు, నిత్యావసరాల ధరలు పెరిగిపోవడంతో పేద, మధ్య తరగతి కుటుంబాలు చాలా ఇబ్బంది పడుతున్నాయి. నియంత్రించాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. గత ఆరు నెలల నుంచి ఇదే పరిస్థితి ఉంది. తగ్గుతాయనుకుంటే ఇంతవరకూ అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం ,ధరల నియంత్రణ చేసి ప్రజలకు మేలు చేయాలి.

– వీరవల్లి శ్రీనివాస్, తోకలపూడి

గోవధను సహించం

- సత్యవాడ రోడ్డు కర్మాగారంలో గోవులను హింసించి చంపుతున్నారు
- ఇది తణుకు ప్రాంతానికే అరిష్టం
- మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తణుకులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: పశ్చిమగోదావరి జిల్లా తణుకు ప్రాంతంలో గోవధ బాధాకరమని, ఎప్పటికీ సహించబోనని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు స్పష్టం చేశారు. తణుకులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తేతలి గ్రామ పంచాయతీ పరిధిలోని సత్యవాడ రోడ్డులో ఏర్పాటుచేసిన లేహం ఫుడ్ ప్రొడక్ట్స్ కర్మాగారంలో గోవులు, గేదెలు, పశువులను క్రూరంగా హింసించి చంపే దురదృష్టకర పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత టీడీపీ హయాంలో ఈ సంస్థకు అనుమతులు తీసుకొచ్చి ఏర్పాటుచేశారని, 2019లో తాను ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత కలెక్టర్, ఇతర అధికారులతో మాట్లాడి ఈ ప్రాంతంలో ఎలాంటి వధ జరగకూడదని నిలుపుదల చేయించానని చెప్పారు. అప్పట్లో కేవలం మాంసం ప్రాసెసింగ్ యూనిట్‌గా అనుమతులు తెచ్చుకున్నారని, అది కూడా ఈ ప్రాంతంలో వద్దని ఆపామన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే గోవధ కర్మాగారం మళ్లీ తెరుచుకుందని తెలిపారు. పగలు గేదెలు, పశువులు, రాత్రి సమయంలో గోవులను వాహనాల్లో తీసుకువచ్చి క్రూరంగా హింసించి చంపేస్తున్నారన్నారు. గోవులను వధించే సమయంలో వచ్చే రక్తం, వ్యర్థాలు గోస్తనీ నది ద్వారా పంట కాలువల్లో కలుస్తున్నాయని.. పచ్చటి పైరు ప్రాంతం భవిష్యత్తులో బీడుగా మారిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ ప్రాంతంలో వస్తున్న దుర్వాసనకు ఇళ్లలో ముక్కుమూసుకుని ఉండాల్సి వస్తోందని ఫిర్యాదులు చేస్తున్నారని తెలిపారు. ఈ ప్రాంతంలో ఇలాంటి కర్మాగారం ఏర్పాటుకు కాలుష్య నియంత్రణ సంస్థ ఎలా అనుమతి ఇచ్చిందో తెలియడం లేదని విమర్శించారు.

గేదెల దొంగతనాలు పెరిగాయి

ఇటీవల కాలంలో తణుకుతో పాటు పలు ప్రాంతాల్లో గేదెల దొంగతనాలు పెరిగిపోయాయని కారుమూరి తెలిపారు. గేదెలను అపహరించి వ్యాన్‌ల ద్వారా తీసుకువచ్చి క్షణాల్లో సొమ్ము చేసుకుంటున్నారని చెప్పారు. కర్మాగారంలో లోపలికి ఎవరినీ వెళ్లనీయకుండా వారే వాహనాలను తీసుకు వెళ్లి తిరిగి వాహనాన్ని బయట అప్పగిస్తున్నారని.. దీన్ని బట్టి అక్కడ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, మంత్రి కందుల దుర్గేష్‌లు ఈ పశు వధను నిలుపుదల చేసేందుకు కృషిచేయాలని విజ్ఞప్తి చేస్తున్నానని కారుమూరి అన్నారు. లేదంటే రానున్న రోజుల్లో ప్రజల పక్షాన నిలబడి పోరాటాలకు సిద్ధపడతామని హెచ్చరించారు.

పింఛన్ల కోతకు కుట్ర

- ప్రాతాళ్లమెరక, సూరవరంలో వెరిఫికేషన్
- జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ఒక గ్రామం ఎంపిక
- పక్క మండల గ్రామ కార్యదర్శులతో ధ్రువీకరణ
- ఆందోళనలో పింఛనుదారులు



తణుకు అర్బన్: వైఎస్ జగన్ హయాంలో సంక్షేమానికి పెద్దపీట వేయగా.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం సంక్షేమానికి తూట్లు పొడిచేలా పాలన సాగిస్తోంది. ఇప్పటికే సంక్షేమ పథకాల అమలును పక్కన పెట్టిన ప్రభుత్వం ఇప్పుడు పింఛన్ల తొలగింపునకు శ్రీకారం చుట్టబోతోంది. ఇందుకోసం ఇంటింటికి వెళ్లి పింఛన్ల వెరిఫికేషన్‌కు కార్యాచరణ ప్రకటించింది. జిల్లాలో ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంచుకుని తనిఖీ చేస్తారు.

ఈ నెల 9, 10 తేదీల్లో వెరిఫికేషన్

కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పింఛన్లు తొలగిస్తామంటూ కూటమి నేతలు చేసిన హెచ్చరికలతో ఇప్పటికే పింఛనుదారులు ఆందోళనతో ఉన్నారు. ఇప్పుడు ఏకంగా దానికి ముహూర్తం నిర్ణయించారు. అక్రమమార్గంలో పింఛన్లు పొందారనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ల వెరిఫికేషన్‌కు ఆదేశాలిచ్చింది. పైలట్ వెరిఫికేషన్ పేరుతో పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి కాళ్ల మండలంలోని ప్రాతాళ్లమెరక గ్రామంలో 416 పింఛన్లు, ఏలూరు జిల్లాకు సంబంధించి ఆగిరిపల్లెలోని సూరవరంలో 423 పింఛన్లను ఈ నెల 9, 10 తేదీల్లో పింఛనుదారుల ఇళ్లకు వెళ్లి వెరిఫికేషన్ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. పింఛనుదారుల ఇంటికి వెళ్లి చేసే వెరిఫికేషన్‌లో ఆ ప్రాంత వార్డు, గ్రామ సెక్రటరీలు కాకుండా పక్క మండలాలకు చెందిన సెక్రటరీలను పంపించనున్నట్లు సమాచారం. ఈ వెరిఫికేషన్‌లో 11 బృందాలు విధుల్లో ఉండగా ఒక్కో బృందంలో ఒక గెజిటెడ్ అధికారి, ఒక సచివాలయ ఉద్యోగి ఉంటారని తెలుస్తోంది.

గత 6 నెలల్లో కొత్త పింఛన్లు సున్నా

కూటమి ప్రభుత్వం ఏర్పడి 6 నెలలు పూర్తయినా ఇంతవరకు ఒక్క కొత్త పింఛను కూడా ఇవ్వకపోగా పాత పింఛన్లపై వెరిఫికేషన్ పేరుతో కత్తిరించేందుకు సిద్ధమవుతోందని పింఛనుదారులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికే మా పింఛను తొలగించకు బాబూ అంటూ కూటమి నేతల్ని బతిమలాడుకుంటున్న పింఛనుదారులు.. తమ పింఛను ఉంచుతారో? లేదో? అన్న ఆందోళనలో ఉన్నారు.

ఉమ్మడి పశ్చిమలో 4,92,130 పింఛన్లు

పశ్చిమ గోదావరి జిల్లాలో దివ్యాంగులు, వితంతు, వృద్ధాప్య, ఒంటరి మహిళ, డయాలసిస్ తదితర పింఛన్లలో భాగంగా 2,28,362 మంది పింఛనుదారులు ప్రతి నెలా పింఛను పొందుతున్నారు. ఇందుకోసం ప్రతి నెలా ప్రభుత్వం రూ.96.26 కోట్లు వెచ్చిస్తోంది. ఏలూరు జిల్లాలో 2,63,768 మంది పింఛనుదారులకు రూ.76 కోట్లు విడుదల చేస్తోంది. పింఛన్ల పంపిణీలో కోత విధించాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అధికార పార్టీ నేతలు పలు హెచ్చరికలు జారీచేశారు. దీంతో పింఛనుదారులతోపాటు వారిపై ఆధారపడ్డ కుటుంబసభ్యులు కూడా తమ పింఛను ఏమవుతుందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పశ్చిమ గోదావరి జిల్లా డీఆర్‌డీఏ పీడీ వేణుగోపాల్‌ను సాక్షి వివరణ కోరగా ప్రభుత్వ ఆదేశాల మేరకు పింఛన్లపై పైలట్ వెరిఫికేషన్‌ను ర్యాండమ్‌గా నిర్వహిస్తున్నామని, కాళ్లలోని ప్రాతాళ్లమెరకలో ఈ నెల 9, 10 తేదీల్లో 416 పింఛన్లను ర్యాండమ్‌గా వెరిఫికేషన్ చేయనున్నట్లు వివరించారు.

‘టీచర్ల’ సమ్మె.. పట్టని ప్రభుత్వం

- రెగ్యులర్ చేయాలని అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల డిమాండ్
- 23 రోజులుగా ఐటీడీఏ వద్ద ధర్నాలు
- నిలిచిపోయిన బోధన.. పూర్తికాని సిలబస్
- పరీక్ష సమయం కావడంతో పదో తరగతి విద్యార్థుల్లో ఆందోళన



బుట్టాయగూడెం మండలం కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద సమ్మె చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

బుట్టాయగూడెం: ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమ్మె బాటతో బోధనకు ఆటంకం ఏర్పడింది. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తుండగా.. ప్రభుత్వం మాత్రం వారికి ఎలాంటి హామీ ఇవ్వకుండా వెంటనే విధుల్లో చేరాలని షోకాజ్ నోటీసులు జారీ చేసింది. తమ న్యాయమైన డిమాండ్ల విషయంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తోందని.. అందువల్లే సమ్మె చేయాల్సి వస్తోందని ఉపాధ్యాయులు అంటుండగా.. ప్రభుత్వ నిర్లిప్తత వల్ల సిలబస్ పూర్తి చేసి రివిజన్‌కు సన్నద్ధం కావాల్సిన సమయంలో పాఠాలు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది.

కోటరామచంద్రపురం(కేఆర్‌పురం) ఐటీడీఏ పరిధిలో ఉన్న బుట్టాయగూడెం మండలం బూసరాజుపల్లి, కేఆర్‌పురం, జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడులోని మూడు గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి నుంచి 10వ తరగతి వరకు సుమారు 1,360 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. బుట్టాయగూడెంలోని బూసరాజుపల్లి పాఠశాలలో 460 విద్యార్థులకు 12 మంది అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారు. కేఆర్‌పురం పాఠశాలలో 400 మంది విద్యార్థులకు 17 మంది, జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడు పాఠశాలలో 500 విద్యార్థులకు 17 మంది అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులతో పాటు 9 మంది రెగ్యులర్ ఉపాధ్యాయులు ఉన్నారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ 23 రోజులుగా అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు సమ్మెబాట పట్టారు.

అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల డిమాండ్లు

ఎన్నికల సమయంలో ఉద్యోగ భద్రత కల్పిస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారని అధికారంలోకి వచ్చాక పటించుకోవడం లేదని అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మెగా డీఎస్సీ నుంచి తమ పోస్టులకు మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అవుట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న తమను రెగ్యులర్ లేదా కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లుగా ప్రకటించాలని కోరుతున్నారు. ఉపాధ్యాయులు విధుల్లోకి చేరకపోతే చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం నోటీసులు జారీచేసింది. నోటీసులకు భయపడకుండా ఉపాధ్యాయులు సమ్మె కొనసాగిస్తున్నారు.

ప్రభుత్వం చొరవ తీసుకోవాలి : విద్యార్థుల తల్లిదండ్రులు

సమ్మె కారణంగా 10వ తరగతి విద్యార్థుల చదువుకు ఆటంకం ఏర్పడింది. అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి పాఠశాలల్లో సజావుగా బోధన జరిగేలా చూడాలని పాఠశాల విద్యాకమిటీ సభ్యులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

మా శ్రమను గుర్తించాలి



తక్కువ వేతనంతో ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్నాం. మమ్మల్ని సీఆర్‌టీలుగా పరిగణించాలి. డీఎస్సీలో మా స్థానాలను మినహాయించాలి. 2022 పీఆర్‌సీ ప్రకారం వేతనాలు పెంచాలి.

– కె.పోసీరావు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘ నేత, కేఆర్‌పురం

హామీలు అమలు చేయాలి



ఎన్నికలకు ముందు తమకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక హామీని మరిచారు. అందుకే మా న్యాయమైన డిమాండ్ కోసం సమ్మె బాట పట్టాం.

– ఎమ్.బుచ్చిరాజు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగి, కేఆర్‌పురం

డిమాండ్లు పరిష్కరించాలి



అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలి. 23 రోజులుగా పాఠశాలల్లో విద్యాబోధన లేకపోవడం వల్ల విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడింది. 10వ తరగతి విద్యార్థుల పరిస్థితి అధ్వానంగా ఉంది.

– తెల్లం బాలరాజు, మాజీ ఎమ్మెల్యే, దుద్దుకూరు

మందుబాబుల వీరంగం



దాడిలో గాయపడ్డ అంజిబాబు

ద్వారకాతిరుమల: స్థానిక ఒక మద్యం దుకాణం వద్ద ఆదివారం సాయంత్రం కొందరు మందుబాబులు వీరంగం సృష్టించారు. షాపులో యువకుడితో ఘర్షణకు దిగారు. బీరు బాటిళ్లతో దాడికి తెగబడ్డారు. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. కొందరు వ్యక్తులు, వెంకటకృష్ణాపురానికి వెళ్లే మార్గంలోని షాపులో మద్యం సేవిస్తున్నారు. మద్యం షాపులో పనిచేసే యువకుడికి, వారికి మధ్య ఘర్షణ జరిగింది. ఇది కాస్తా కొట్లాటకు దారితీసింది. బీరు బాటిళ్లతో దాడులు చేసుకున్నారు. అడ్డు వెళ్లిన గ్రామానికి చెందిన భీమవరపు అంజిబాబుపై దాడి చేశారు. అంజిబాబు తలకు తీవ్ర గాయాలయ్యాయి. లక్కవరానికి చెందిన మరో వ్యక్తి సైతం గాయపడ్డాడు. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులను సైతం మందుబాబులు లెక్కచేయకుండా కొట్టుకున్నారు. క్షతగాత్రులను స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం 108లో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మద్యం ఏరులై పారుతోందని, మందుబాబుల ఆగడాలు పెరిగిపోయాయని స్థానికులు అంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా షాపుల వద్ద సిట్టింగ్‌లు ఏర్పాటు చేసి, మందుబాబులను ప్రోత్సహిస్తుండటమే గొడవలకు కారణమని పలువురు ధ్వజమెత్తుతున్నారు.

క్లుప్తంగా

విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ధర్నా


పోలీస్ ఐలాండ్ వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ ఐలాండ్ వద్ద ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని మాయమాటలు చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్మార్ట్ మీటర్లు బిగించడం సిగ్గు చేటు అని విమర్శించారు. విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు ఆపాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. దేశ, రాష్ట్ర సంపదను లూటీ చేశారని, కార్పొరేట్లను కాపాడుతున్న బీజేపీ, టీడీపీ కూటమి ప్రభుత్వాలకు తగు బుద్ధి చెప్పాలన్నారు. పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, జవ్వాది శ్రీను, శిద్దిరెడ్డి శేషు, పోతు శ్రీను, పెనుగంటి దుర్గా, పూడి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

శశి ఇంజనీరింగ్‌కు నాక్ ఏ ప్లస్ గ్రేడ్ గుర్తింపు


అధ్యాపక బృందంతో యాజమాన్యం

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం శశి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజనీరింగ్ విద్యాసంస్థ నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్ (నాక్) నుంచి ఏ ప్లస్ గ్రేడ్ అందుకుంది. కళాశాలలోని విద్యా నాణ్యత, అధ్యాపకులు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పరిశోధనలో ఉన్నత ప్రమాణాలు, సామాజిక కార్యక్రమాలు తదితర అంశాలపై నాక్ బృంద సభ్యులు నివేదికను అందజేశారు. శశి కళాశాలకు 2029 వరకు నాక్ ఏ ప్లస్ గ్రేడ్ కేటగిరి కేటాయించారు. ఈ సందర్భంగా అడ్వైజరీ సభ్యులకు, అధ్యాపక బృందానికి, విద్యార్థులకు, తల్లిదండ్రులకు వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాల్ కృష్ణ, ప్రిన్సిపాల్ మొహమ్మద్ ఇస్మాయిల్ కృతజ్ఞతలు తెలిపారు.

ఒంటిపై పెట్రోలు పోసుకుని..

తణుకు అర్బన్: గుర్తుతెలియని వ్యక్తి ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన తణుకు జాతీయరహదారి బీసీ కల్యాణ మండపం నిమ్మగడ్డ హాస్పిటల్ ప్రాంతంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మంటల్లో 90 శాతం కాలిపోయిన వ్యక్తిని 108 వాహనం ద్వారా తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రికి చేర్చగా పరిస్థితి విషమించడంతో ప్రాథమిక చికిత్స అనంతరం ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తనకు ఎవరూలేరని, తనది తణుకేనని, వయస్సు 40 సంవత్సరాలని, పేరు సుబ్బారావుగా చెప్పినట్లు 108 సిబ్బంది చెబుతున్నారు. అయితే ఆ వ్యక్తి ఎవరు, ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారనే వివరాలు తెలియలేదు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు చెబుతున్నారు.

● బీచ్‌లో సందడి


జిల్లాలోనే ఏకైక బీచ్‌లైన పేరుపాలెం, కేపీపాలెం బీచ్‌లు ఆదివారం పర్యాటకులతో కళకళలాడాయి. గత ఆదివారం తుపాను కారణంగా భారీ వర్షాలు, సముద్రపు అలలు ఎగిసిపడతాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బీచ్‌కు సందర్శకులను అనుమతించలేదు. ప్రస్తుతం వాతావరణం సాధారణంగా ఉండడంతో పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివచ్చి బీచ్‌లో సేదతీరారు. ఉవ్వెత్తున్న ఎగిసిపడుతున్న అలలు నడుమ సముద్ర స్నానం చేస్తూ కేరింతలు కొడుతూ సరదాగా గడిపారు. అనంతరం తీరంలోని ఆలయాలను సందర్శించారు. – మొగల్తూరు

● పాల కావిడి ఉత్సవం


ద్వారకాతిరుమల చెరువు వీధిలోని శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయంలో ఆదివారం పాల కావిడి ఉత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకుల వేద మంత్రోచ్ఛరణల నడుమ పాల కావిళ్ల గ్రామోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకలో పెద్దలతో పాటు చిన్నారులు, బాలలు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పాల కావిళ్లను మోయడం ద్వారా సర్వదోషాలు తొలగుతాయని పండితులు చెబుతున్నారు. కాగా రాత్రి నెమలి వాహనంపై స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. – ద్వారకాతిరుమల

● మంగమ్మ తల్లి సన్నిధిలో..


గుబ్బల మంగమ్మ తల్లి గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు దర్శనానికి వచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు, సర్పంచ్ కోర్స గంగరాజు తెలిపారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, మినీ బస్సుల్లో భక్తులు తరలివచ్చారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అదేవిధంగా మర్లగూడెం అటవీ ప్రాంతంలో కొలువై ఉన్న పాటమ్మతల్లిని, పసుపులమ్మ తల్లిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. – బుట్టాయగూడెం

అరకు కాఫీ గుబాళింపు

- బుట్టాయగూడెం, కేఆర్‌పురంలో కాఫీ హబ్ ఏర్పాటు
- రోజురోజుకూ పెరుగుతున్న కాఫీ ప్రియుల సంఖ్య


బుట్టాయగూడెం కాఫీ హబ్‌లో అరకు కాఫీ తయారు చేస్తున్న దృశ్యం


అరకు కాఫీ

బుట్టాయగూడెం : అరకు కాఫీ పేరు చెప్పగానే ఆహా అనాల్సిందే. ఎందుకంటే దాని గుబాళింపు అలాంటిది మరి. ప్రకృతి ఒడిలో పండుతున్న అరకు కాఫీని ఒక్కసారైనా టేస్ట్ చూడాలనుకుంటారు కాఫీ ప్రియులు. అరకులో పుట్టి దేశవ్యాప్తంగా విస్తరించి విదేశాల్లో సైతం కాఫీ ప్రియుల మనసు గెలుసుకుంటున్న అరకు కాఫీ ఇప్పుడు బుట్టాయగూడెంలో అందుబాటులోకి వచ్చింది. కోటరామచంద్రాపురం గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఆధ్వర్యంలో సూపర్ బజార్, కాఫీ హబ్‌ను ఏర్పాటు చేశారు. ప్రపంచ ప్రఖ్యాతి గడించిన అరకు కాఫీ రుచులను పశ్చిమ మన్యం ప్రజలు కూడా ఆస్వాదించేందుకు వీలుగా కాఫీ హబ్‌ను ఏర్పాటు చేసినట్లు జీసీసీ అధికారులు చెప్పారు. ప్రస్తుతం ఈ అరకు కాఫీని కేఆర్‌పురం, ఐటీడీఏ వద్ద బుట్టాయగూడెంలో రెండు చోట్ల ఏర్పాటు చేశారు. ఈ కాఫీ హబ్‌ల్లో రోజురోజుకూ కాఫీ ప్రియుల సంఖ్య పెరుగుతుంది.

సూపర్ బజారులో అటవీ ఉత్పత్తులు

బుట్టాయగూడెంలో ఏర్పాటు చేసిన జీసీసీ సూపర్ బజారులో అటవీ ఉత్పత్తులను వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. అటవీ ప్రాంతంలో నివసించే గిరిజనులు అటవీ ఉత్పత్తులపైనే ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. వారు సేకరించే ఉత్పత్తుల్లో పుట్ట, తొర్ర తేనె ఒకటి. దీనిని జీసీసీ గిరిజనుల నుంచి కొనుగోలు చేసి శుద్ధి చేసి విక్రయిస్తుంది. స్వచ్ఛమైన తేనె బుట్టాయగూడెం సూపర్ బజార్‌లో లభిస్తుంది. అరకు ఫిల్టర్ కాఫీ ప్యాకెట్లు, కుంకుడు కాయల ప్యాకెట్లు, షీకాయ షాంపూలు, హెర్బల్ సబ్బులు, డిటర్జెంట్‌లు, కొండ బొబ్బర్లు, అడవి పసుపు, కొండ చీపుర్లు, ఎర్ర చిక్కుళ్లు, ఉసిరి పౌడర్, పెయిన్ రోలర్, స్ప్రేలు వంటివి అందుబాటులో ఉన్నాయి.

అరకు కాఫీ రుచి అద్భుతం


అరకు కాఫీ రుచి అద్భుతంగా ఉంది. ప్రతీరోజూ ఉదయం, సాయంత్రం కాఫీహబ్‌లో తాగుతున్నాం. అటవీ ఉత్పత్తులు కూడా నాణ్యంగా ఉన్నాయి. నేనే కాదు ఏలూరు నుంచి వచ్చిన నా స్నేహితులు కూడా అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేసి తీసుకువెళ్ళారు. అరకు కాఫీ, అటవీ ఉత్పత్తులను అందుబాటులో ఉంచినందుకు అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు.
– సోడెం సుధాకర్, కాఫీ ప్రియుడు, బుట్టాయగూడెం

అటవీ ఉత్పత్తులు ప్రజలకు అందుబాటులో


పశ్చిమ ఏజెన్సీ ప్రాంతం బుట్టాయగూడెం మండలంలో కేఆర్‌పురం, బుట్టాయగూడెం గ్రామాల్లో అరకు కాఫీని అందుబాటులోకి తీసుకువచ్చాం. కాఫీ ప్రియులు కూడా బాగానే ఆస్వాదిస్తున్నారు. అలాగే అటవీ ఉత్పత్తులు కూడా ప్రజలకు అందుబాటులో ఉంచేలా సూపర్ బజారుల్లో ఉంచాం.
– జి.పార్వతీశ్వరరావు, జీసీసీ ఇన్‌చార్జి సీనియర్ మేనేజర్, కేఆర్‌పురం

భార్యపై హత్యాయత్నం

- కుటుంబ కలహాల నేపథ్యంలో ఘటన
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు


దాడిలో తీవ్రంగా గాయపడిన శైలజ

జంగారెడ్డిగూడెం: తన భార్యపై ఓ వ్యక్తి కత్తితో హత్యాయత్నానికి పాల్పడిన ఘటన జంగారెడ్డిగూడెంలో ఆదివారం చోటు చేసుకుంది. తీవ్రంగా గాయపడిన బాధితురాలు రాజమండ్రి ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, దాడికి కారణమైన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని జగజ్జీవనరామ్ నగర్‌కు చెందిన శైలజకు, ఎస్సీ పేటకు చెందిన ముప్పిడి రామకృష్ణతో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి నలుగురు ఆడపిల్లలు ఉన్నారు. గత కొంతకాలంగా శైలజకు, రామకృష్ణ మధ్య గొడవలు జరుగుతున్నాయి. సమస్యను పెద్దల మధ్య పెట్టినా ఫలితం లేకపోవడంతో, కొద్ది రోజులుగా శైలజ పుట్టింటి వద్దే ఉంటోంది. ఆదివారం స్థానిక సీఎస్ఐ చర్చి సమీపంలో ద్వారా మీటింగ్‌కు వచ్చింది. రోడ్డుపై గ్రూపు సభ్యులతో మాట్లాడుతుండగా, విషయం తెలుసుకున్న రామకృష్ణ ద్విచక్ర వాహనంపై వచ్చి శైలజను ఢీకొట్టాడు. తనవెంట తెచ్చుకున్న కత్తితో ఆమెపై విచక్షణా రహితంగా దాడి చేసి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. వెంటనే స్థానికులు శైలజను స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో రాజమండ్రికి తరలించారు. ఈ ఘటనలో దాడిని అడ్డుకోబోయిన ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న డీఎస్పీ యు.రవిచంద్ర, సీఐ కృష్ణబాబు, ఎస్సై జబీర్‌లతో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. శైలజపై దాడి చేసిన భర్త రామకృష్ణను ఎస్సై షేక్ జబీర్ అదుపులోకి తీసుకున్నారు.

దొంగ అరెస్టు.. చోరీ సొత్తు రికవరీ


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జయసూర్య

భీమవరం: రాత్రి వేళల్లో ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న దొంగను పోలీసులు అరెస్ట్ చేసి అతడి నుంచి చోరీ సొత్తును రికవరీ చేశారు. ఆదివారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో భీమవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య వివరాలు వెల్లడించారు. పెంటపాడు మండలం, చింతపల్లి గ్రామానికి చెందిన ఖండవల్లి సీతారాముడు వ్యసనాలకు అలవాటు పడి డబ్బులు చాలక రాత్రి సమయాల్లో తాళం వేసి ఉన్న ఇళ్లల్లో చోరీలు చేస్తున్నాడు. భీమవరంలోని ఆదర్శనగర్, బలుసుమూడి, ఏఎస్సార్ నగర్‌లలో జరిగిన చోరీలకు సంబంధించి ఇతడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. రావులపాలెం, అత్తిలి పోలీస్‌స్టేషన్‌లలో సైతం ఇతడిపై కేసులు నమోదయ్యాయి. ఆదివారం సీతారాముడుని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి సుమారు రూ.8.85 లక్షల విలువైన బంగారు, వెండి వస్తువులు రికవరీ చేసినట్లు డీఎస్పీ జయసూర్య చెప్పారు. ఈ సమావేశంలో రూరల్ సీఐ బంటుమిల్లి శ్రీనివాసరావు, ఎస్సైలు రెహమాన్, ఇజ్రాయేల్, రూరల్ ఎస్సై వీర్రాజు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్కూటీని ఢీకొన్న ట్రాక్టర్.. తల్లీకూతుళ్ల మృతి

గోపాలపురం: వేగంగా దూసుకువచ్చిన ట్రాక్టరే వారి పాలిట మృత్యుశకటమైంది. మండలంలోని దొండపూడి గ్రామ శివార్లలో ట్రాక్టర్ ఢీకొని ఇద్దరు తల్లీకూతుళ్లు ఆదివారం మృతి చెందారు. ఎస్సై కర్రి సతీష్ కుమార్ కథనం ప్రకారం.. ఏలూరు జిల్లా పోలవరం మండలం బక్కబండ్లగూడెం గ్రామానికి చెందిన కురసాని కాంతమ్మ (45), ఆమె తల్లి కవలం గన్నెమ్మ (72) కలసి గోపాలపురం మండలం దొండపూడికి స్కూటీపై వచ్చారు. పనులు ముగించుకొని తిరిగి వెళుతుండగా గ్రామ శివార్లలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ వారిని బలంగా ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన తల్లీకూతుళ్లను 108లో రాజమహేంద్రవరం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఇద్దరూ మృతి చెందారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. మృతురాలు కాంతమ్మ బక్కబండ్లగూడెంలో అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


రమేష్ మృతదేహం

భీమవరం అర్బన్: ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలివి. వెంప గ్రామానికి చెందిన సానబోయిన రమేష్ (30), కొరు వాసు, సానబోయిన రవి, సానబోయిన మోహన్ రెండు ద్విచక్ర వాహనాలపై భీమవరం వెళ్తున్నారు. రమేష్ ద్విచక్రవాహనం నడుపుతుండగా కొరు వాసు వెనుక సీట్లో కూర్చున్నాడు. బేతపూడి గ్రామానికి వచ్చేసరికి వీరు నడుపుతున్న ద్విచక్రవాహనానికి ఎదురుగా మరో ద్విచక్ర వాహనం వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో రమేష్ తీవ్రంగా గాయపడగా, మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. రమేష్‌ను అంబులెన్స్ ద్వారా భీమవరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రమేష్‌కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. వాసు ఫిర్యాదు మేరకు ఎస్సై వీర్రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరి పంటను కాపాడుకుందాం ఇలా..


యంత్రాలతో వరి కోతలు సాగుతున్న దృశ్యం


ధాన్యాన్ని ఆరబెట్టిన దృశ్యం

పాడి - పంట

చింతలపూడి: జిల్లాలోని మెట్ట ప్రాంతంలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం వల్ల వర్షాలు పడే అవకాశం ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో వరి రైతులు తగిన జాగ్రత్తలు చేపట్టి పంట నష్టాన్ని నివారించుకోవాలి. వరి పంటను కాపాడుకోవడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి నాగకుమార్ రైతులకు పలు సూచనలు చేశారు.

కోతకు సిద్ధంగా ఉంటే..

కోతకి సిద్ధంగా ఉన్న వరి పంటని వర్షాలకు ముందు కోయకూడదు. ఒకవేళ ముందుగానే కోతలు కోసుకుని ఉంటే పూర్తిగా ఆరని పనలను కుప్ప వేసేటప్పుడు ఎకరాకు 25 కిలోల ఉప్పును పనలపై చల్లుకుంటూ కుప్పవేసుకోవడం వల్ల నష్టాన్ని నివారించుకోవచ్చు. కోత కోసి పొలంలో ఉన్న పనలు వర్షానికి తడిచినట్లయితే గింజ మొలకెత్తకుండా ఉండడానికి 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై పడేవిధంగా పిచికారీ చేయాలి. ఒక వేళ పొలంలో నీరు నిలిచి ఉన్నట్లయితే పనలను గట్ల పైకి తెచ్చుకొని విడగొట్టి ఉప్పు ద్రావణం చల్లుకోవాలి. వర్షాలు తగ్గి ఎండ రాగానే పనలను తిరగేసి ఎండబెట్టి నూర్చుకోవాలి.

కల్లాల మీద ఉంటే..

కల్లాల మీద ఉన్న ధాన్యాన్ని వర్షానికి తడవకుండా భద్రపరుచుకోవాలి. నూర్చిన ధాన్యం 2–3 రోజులు ఎండ బెట్టడానికి వీలు కాకపోతే కుప్పలలో గింజ మొలకెత్తడమే కాక రంగు మారి చెడు వాసన వస్తుంది. ఇటువంటి పరిస్థితుల్లో నష్టాన్ని నివారించడానికి ఒక క్వింటా ధాన్యానికి ఒక కిలో ఉప్పు, 20 కిలోల పొడి ఊక కలిపి ధాన్యం పోగు పెట్టడం వల్ల గింజ మొలకెత్తకుండా, చెడిపోకుండా నివారించుకోవచ్చు. ఎండ కాసిన తరువాత ధాన్యాన్ని ఎండబోసి, తూర్పార బట్టి నిలవ చేసుకోవాలి.

పిగులు పొట్ట, పూత దశలో..

పైరు 1 నుంచి 2 రోజుల కన్నా ఎక్కువ రోజులు నీట మునిగితే కంకి పూర్తిగా బయటకు రాకపోవడం, పుష్పాలలో నీరు చేరడం వలన ఫలదీకరణ శక్తి కోల్పోయి తాలు, రంగు మారిన గింజలు ఏర్పడతాయి. గింజ రంగు మారకుండా ఉండటానికి లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజం లేదా రెండు గ్రాముల కార్బెండిజంతోపాటు మాంకోజెబ్ లేదా 1 మి.లీ ప్రోపికొనజోల్ మందును పిచికారీ చేయాలి.

పాలు పోసుకునే దశలో..

ఈ దశలో 2 నుంచి 3 రోజులకన్నా ఎక్కువగా పంట నీట మునిగితే పిండి పదార్థాలు గింజల్లో చేరక గింజ బరువు తగ్గి రంగు మారి, తద్వారా దిగుబడి, నాణ్యత తగ్గుతాయి. గింజ రంగు మారకుండా ఉండటానికి లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజం లేదా రెండు గ్రాముల కార్బెండిజంతోపాటు మాంకోజెబ్ లేదా 1 మి.లీ ప్రోపికొనజోల్ మందును పిచికారీ చేయాలి.

గింజ గట్టిపడే దశలో..

కోత దశ చేను పడిపోకుండా ఉండి, నిద్రావస్థ కలిగిన రకాల్లో నష్టం తక్కువగా ఉంటుంది. నిద్రావస్థ లేనటువంటి బి.పి.టి 5204 వంటి రకాలు నీటమునిగితే గింజ మొలక వచ్చి నష్టం ఎక్కువగా ఉంటుంది. నిద్రావస్థ ఉన్న రకాల్లో కూడా చేను పడిపోయి వారం రోజులకన్నా ఎక్కువగా నీట మునిగినట్లయితే గింజల్లో నిద్రావస్థ తొలిగి చేనుపైనే మొలకవచ్చే అవకాశం ఉంది. దీని నివారణకు 5 శాతం ఉప్పు ద్రావణాన్ని చేనుపై పిచికారీ చేయాలి.

గింజ తోడుకున్న లేదా గట్టిపడే దశలో..

వెన్ను బరువువల్ల మొక్కలు కొద్దిపాటి గాలి, వర్షాలకే కణుపుల వద్ద విరిగి నేలకి వరుగుతాయి. ఈ విధంగా పడిపోవడం వల్ల పిండి పదార్థం గింజలకు సరిగ్గా చేరక గింజ బరువు తగ్గడం లేదా తాలు గింజలు ఏర్పడటం జరిగి, తద్వారా దిగుబడి తగ్గే అవకాశం ఉంది. దీనితోపాటూ పడిపోయిన చేల నుంచి వచ్చే ధాన్యం రంగు మారి, మిల్లింగ్ సమయంలో విరిగిపోయి, బియ్యంపై మచ్చ వచ్చే అవకాశం ఉంది. పడిపోయిన చేలలో యంత్రాలతో కోత కోయడానికి ఎక్కువ సమయం పట్టడం వల్ల కోత ఖర్చుకూడా పెరిగిపోతుంది. నష్ట నివారణకు, పడిపోయిన చేలలో వీలైనంత తొందరగా దుబ్బులను లేపి నిలబెట్టి కట్టలుగా కట్టే చర్యలు చేపట్టాలి.

దాళ్వా నారుమడి దశలో ఉంటే..

విత్తనం చల్లిన 2–3 రోజుల వయసులో ఉన్నప్పుడు, మూడు రోజుల కన్నా ఎక్కువ నీట మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గుతుంది. ఈ దశలో వీలైనంత తొందరగా నీటిని పూర్తిగా బయటకు తీసివేయడం వల్ల విత్తనం కోర గాలిపోసుకొని ఎటువంటి నష్టం జరగదు. అలా కాక నీరు తీయడానికి వీలు లేక మొలక దెబ్బతింటే తిరిగి విత్తనం చల్లుకోవలసిన అవసరం ఏర్పడుతుంది.

- విత్తిన 7 నుంచి 30 రోజుల మధ్యలో నారుమడి 5 రోజుల కన్నా ఎక్కువగా నీట మునిగితే నారు దెబ్బతినే అవకాశం ఉంది. కాబట్టి నారు నీట మునిగిన 5 రోజుల లోపు, నీటిని పూర్తిగా బయటకు తీసివేసి పంటకు గాలి తగిలేలా చేయాలి. నష్ట నివారణకు నీటిని తీసివేసిన తరువాత, 5 సెంట్ల నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవడం వలన కొత్తఆకు వచ్చి ఊడ్పులకు అందుతుంది.

తెగుళ్ల బారిన పడకుండా..

అధిక వర్షాలకు నారుమడి దశలో పంట తెగుళ్ల బారిన పడకుండా, నీరు పూర్తిగా తీసివేసి మొక్క నిలదొక్కుకున్న తరువాత లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజం లేదా రెండు గ్రాముల కార్బెండిజంతోపాటు మాంకోజెబ్ కలిసిన మిశ్రమమందు గానీ కలిపి పిచికారీ చేయాలి.

పిలక దశలో..

పంట ఊడ్చిన వెంటనే, పిలక దశలో ముంపునకు గురైనట్లయితే నీటిని పూర్తిగా బయటకు తీసివేసి తరువాత పైపాటుగా ఎకరాకు 20 కిలోల యూరియాతోపాటు 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అదనంగా వేసుకోవాలి. ఈ విధంగా బూస్టర్ డోస్ వేసుకోవడం వలన మొక్క ముంపు ప్రభావం నుంచి త్వరగా కోలుకుంటుంది. మొక్క కోలుకున్న తరువాత కుళ్లు తెగుళ్ల రాకుండా లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజం కలిపి పిచికారీ చేయాలి. పొలంలో నిలిచిన నీరు మురుగు కాలువల ద్వారా బయటకు వెళ్లేటట్లు బాటలు ఏర్పాటు చేసుకోవాలి.


నాగకుమార్, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్

క్లుప్తంగా

విద్యార్థినికి 'మానవత' ఆర్థిక సాయం



విద్యార్థినికి చెక్కును అందజేస్తున్న మానవత సంస్థ అధ్యక్షురాలు శారదాదేవి

తణుకు టౌన్: నరసాపురం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినికి రూ.10 వేలను కళాశాల ఫీజుల నిమిత్తం అందజేసినట్లు మానవత సంస్థ అధ్యక్షురాలు కఠారి శారదాదేవి తెలిపారు. ఆదివారం తణుకు రోటరీ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో స్వర్ణాంధ్ర కళాశాలలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని నెక్కంటి కీర్తి సాయిలక్ష్మికి విరాళం చెక్కును అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మానవత జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, కన్వీనర్ ఎస్వీ సతీష్‌బాబు, మల్లిన అరుణ సారధి, అక్కిన కాశీ, వంగూరి హనుమంతరావు, సుబ్బారావు, విశ్వనాథరాజు, పి.రామకృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రోడ్డు రన్



రోడ్డు రన్‌ను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

తణుకు టౌన్: మన రోడ్డు, మన పరుగు పేరుతో ఆదివారం తణుకులో నిర్వహించిన రోడ్డు రన్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. తణుకులోని ఎస్‌కేఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ప్రారంభమైన ఈ రన్ త్రీకే, ఫైవ్‌కే, టెన్‌కే విభాగాలు నిర్వహించారు. కార్యక్రమంలో అన్ని వయస్సుల వారు పాల్గొన్నారు. నిర్వాహకులు విశ్వతేజ జెండా ఊపి ప్రారంభించారు. పట్టణంలోని రాష్ట్రపతి రోడ్డు మీదుగా సుమారు పది కిలోమీటర్ల మేర ఈ రన్ సాగింది. పోటీల్లో విజేతలకు బహుమతులు అందించినట్లు తెలిపారు.

క్రైస్తవ యూత్ ఆధ్వర్యంలో బైబిల్ పోటీలు



బైబిల్ పోటీల్లో పాల్గొన్న పాస్టర్లు, టీసీవై నాయకులు, సభ్యులు

తణుకు అర్బన్: క్రైస్తవ యూత్ 25వ వార్షిక క్రిస్మస్ వేడుకల్లో భాగంగా స్థానిక లూథరన్ చర్చిలో ఆదివారం బైబిల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ సంఘాల యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలకు ఈ నెల 13వ తేదీన తణుకు నూలి గ్రౌండ్స్‌లో నిర్వహించే క్రిస్మస్ వేడుకల్లో బహుమతులు అందజేస్తారని టీసీవై కన్వీనర్ మురాల సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో పి.నిరీక్షణరాజు, పాస్టర్ మనోజ్‌బాబ్, పాస్టర్ టి.అబ్బులు, పి.శాంతకుమారి, టీసీవై కార్యదర్శి అనీల్ చక్రవర్తి, సభ్యులు ఎలిపే ముఖేష్, అంబటి శ్యామ్ సాగర్, తలారి గంగాధర్, విశ్వాసులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడుల్లో వ్యక్తి అరెస్టు



నిందితుడిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ అధికారులు

తాడేపల్లిగూడెం: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఇన్‌స్పెక్టర్ ఇ.స్వరాజ్యలక్ష్మి, ఎస్సై మురళీ మోహన్, దొర బాబు, సిబ్బంది ఆధ్వర్యంలో వేరు వేరు ప్రదేశాల్లో దాడులు నిర్వహించారు. అత్తిలి మండలం స్కిన్నెరపురంలో ఆదివారం బెల్ట్ షాపుపై దాడులు చేసి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి ఏడు నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేశామని తెలిపారు.

రామాలయంలో భగవద్గీత పారాయణం

పాలకొల్లు సెంట్రల్: భగవద్గీత హిందూ సమాజంలో రుగ్మతలను తొలగించే అద్భుతమైన గ్రంథమని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర మహిళా ప్రముఖ్ తొట్టెంపూడి సునీత అన్నారు. ఆదివారం స్థానిక సుబ్బారాయుడు గుడి సమీపంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో గీతా జయంతి పురస్కరించుకుని భగవద్గీత పారాయణ చేశారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ శ్రీకృష్ణ పరమాత్ముడు అర్జునుడిలో సౌర్యాన్ని రగిలించి అధర్మంపై విజయం సాధించడానికి ఏ విధంగా గీతోపదేశం చేశారో? భగవద్గీత పారాయణంతో తెలుస్తుందన్నారు. హిందూ సమాజంలో ప్రతి ఒక్కరూ భగవద్గీతను అనుసరించి అందులో ఉన్న అర్థం పరమార్థాన్ని గ్రహించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు జక్కంపూడి కుమార్, గాదె వెంకన్న, శశికాంత్ ఆచార్యులు, బంగారు పమణి, యాళ్ల ప్రసాద్, తులసి తదితరులు పాల్గొన్నారు.

వడివడిగా దాళ్వా వరి సాగు పనులు



ఎల్.అగ్రహారం గ్రామంలో దమ్ము చేస్తున్న దృశ్యం



మోదుగ గుంట గ్రామంలో వేసిన నారు మడి

- చివరి దశకు ఖరీఫ్ కోతలు
- 25వేల ఎకరాల్లో దాళ్వా సాగుకు సన్నద్ధం
- నారు మడులు వేసిన రైతులు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండలం బోర్ల ఆయకట్టు గ్రామాల్లో దాళ్వా వరి సాగు పనులు వడివడిగా సాగుతున్నాయి. పలు గ్రామాల్లో మాగ దమ్ము చేసి నాట్లు వేసేందుకు సిద్ధం చేశారు. చినతాడేపల్లి, కడియద్ద, కృష్ణాపురం, నీలాద్రిపురం, పట్టింపాలెం, కొమ్ముగూడెం, వీరంపాలెం, బంగారుగూడెం, అప్పారావుపేట, మాధవరం, ఎల్.అగ్రహారం, మోదుగ గుంట, ఇటుకులగుంట, దండగర్ర, పెదతాడేపల్లి, మెట్ట ఉప్పరగూడెం, కొండ్రుప్రోలు, ఉప్పరగూడెం, ఆరుగొలను, జగ్గన్నపేట, వెంకట్రామన్నగూడెం తదితర గ్రామాల్లో ఇప్పటికే ఖరీఫ్ కోతలు పూర్తి కావడంతో ప్రత్యామ్నాయ పంటగా మినుము, పెసలు సాగు చేశారు. మరో పది రోజుల్లో ఈ పంట చేతికొస్తుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ముందుగానే రైతులు దాళ్వా సీజన్‌కు నారుమడి వేశారు. నారు వేసి 15 రోజులు కావస్తుంది. మరో వారం రోజులకు నారు చేతికొచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. డిసెంబరు మూడవ వారానికి మండలంలో దాళ్వా నాట్లు పడే అవకాశాలు ఉన్నాయి. డిసెంబరు నెలాఖరు నాటికి కాలువ ఆయకట్టులోనూ దాళ్వా సీజన్ ప్రారంభం కానున్నది. దాళ్వా సీజన్‌కు ఎస్ఎల్-10 రకం వరి వంగడాన్ని సాగు చేసేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఈ రకం వరి వంగడం తక్కువ సమయంలో పంట చేతికొస్తుందని, దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉంటాయని రైతులు చెబుతున్నారు.

వాసవీమాత ఆలయంలో కాలభైరవాష్టమి పూజలు



కాలభైరవ స్వామి

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి పంచాయతన క్షేత్రంలో సూర్యనారాయణ స్వామికి, కాల భైరవస్వామికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు సత్యనారాయణ శర్మ, చంద్రశేకర్ శర్మ అర్చకత్వంలో పంచామృత సుగంధ ద్రవ్యాలతో, ఫలరసాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. ఆర్యవైశ్యులు నున్న సుందరరావు, ఆలపాటి సత్యనారాయణ, పేరూరి కాశయ్య, కొనకళ్ల హరనాథ్ పర్యవేక్షించారు.

వైకల్యాన్ని జయించి.. సత్తా చాటి!

- దివ్యాంగులకు బాసటగా భవిత కేంద్రాలు
- బడిబాట పట్టేలా ప్రత్యేక చర్యలు



పదో తరగతిలో ఇటీవల ప్రతిభ చూపిన దివ్యాంగ విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయిని

పెంటపాడు: ప్రత్యేక అవసరాలు కలిగిన బాలలు ఇంటికే పరిమితం కాకుండా వారిలో మానసికంగా, శారీరకంగా ఎదుగుదల తీసుకురావాలనే లక్ష్యంతో భవిత కేంద్రాల ద్వారా వారికి మానసిక, శారీరక తర్ఫీదులు ఇస్తూ చైతన్యాన్ని తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుంది. గత ఏడాది సమీప పాఠశాలల్లో విద్య అభ్యసనకు సిద్ధమైంది. శారీరక, మానసిక వైకల్యం గల పిల్లలకు తమను విభజించారనే భావన కలగకుండా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు విధి, విధానాలు అమలు చేస్తుంది. ప్రాథమిక పాఠశాల సమీప భవిత కేంద్రాలను వాటితో అనుసంధానించారు. సాధారణ పిల్లలతో కలిసి వీరు విద్యాబుద్ధులు నేర్చుకోవడం ద్వారా వారిలో ఆలోచనలు వృద్ధి చెందుతాయనే భావనతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. మాటలు రాని, మానసిక ఎదుగుదల లేని, నడవలేని పిల్లలు ఇళ్లలో ఉండి మరింత మానసికంగా కృంగిపోకుండా వారికి భవిత కేంద్రాల ద్వారా విద్యను అందించారు. చిన్నారుల వైకల్యాలు గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తూనే సాధారణ విద్యను బోధించారు. ఈ తరహా విద్యా శిక్షణలో వృద్ధి చెందిన వారిని ఆపై సాధారణ పాఠశాలల్లో చేర్పించారు. ప్రస్తుతం పిల్లలు వేర్వేరుగా కాకుండా అందరూ సమానమనే భావనను పెంపొందించేందుకు సాధారణ విద్యార్థులతోనే ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అవసరమైన చదువు చెప్పించేలా చర్యలు తీసుకుంది. దీని కోసం మండలానికి ఒక పాఠశాలను ఎంపిక చేసి భవిత కేంద్రాల బాలలను ఆయా పాఠశాలల్లో విలీనం చేశారు. అక్కడ మధ్యాహ్న భోజనం, విద్యా కానుక కిట్లు, విద్యా దీవెన, వంటి సౌకర్యాలను కల్పించారు. ఫిజియోథెరపిస్టులు వ్యాయామం, స్పీచ్‌థెరపీ, యోగా తదితర అంశాలలో శిక్షణ ఇస్తారు.

బహుళప్రయోజనాలు

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు చేరితే ప్రతి నెలా రూ.300 రవాణా భత్యం చెల్లిస్తారు. వినికిడి, దృష్టి లోపం ఉన్నవారికి ట్యాబ్‌లతోపాటు, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు జాతీయ ఉపకార వేతనం ఏడాదికి రూ.9 వేల నుంచి రూ.11 వేలు అందజేస్తారు. వైకల్య శాతం అధికంగా ఉంటే సదరమ్ ధ్రువపత్రంతోపాటు పింఛన్ వస్తుంది. బస్సు, రైల్వేల్లో రాయితీతో కూడిన పాస్‌లు అందిస్తారు. పాఠశాలలకు రాలేనివారికి ఇంటికి వచ్చి బోధనతో ప్రత్యేక శిక్షణ ఇస్తారు.

సేవలు సద్వినియోగం చేసుకోవాలి



ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వ ఆదేశాల మేరకు దివ్యాంగులు, ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు బడిబాట పట్టేలా సర్వే ముమ్మరం చేశాం. చిన్నారులకు ప్రత్యేక శిక్షణ ఇస్తూనే సాధారణ విద్యను బోధిస్తున్నాం. వైకల్యం కలిగిన పిల్లల్లో సామర్థ్యాన్ని పెంపొందించేందుకు సహ విద్య తోడ్పడుతుంది. వైకల్యానికి అనుగుణంగా పరికరాలు ఉపయోగించి వారికి లైఫ్ స్కిల్ నేర్పించడం ద్వారా తోటి విద్యార్థులతో కలిసి చదువుకునేలా కృషి చేస్తున్నాం.

– సాయి స్వరూప, ఉపాధ్యాయిని

లయన్స్ మాజీ గవర్నర్ మృతి తీరని లోటు



డాక్టర్ వై.జగన్‌మోహన్‌రావు భౌతికాయానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, రాజకుమారి

తణుకు టౌన్: సేవా మార్గంలో నడుస్తూ అనేక మందిని సేవా మూర్తులుగా తీర్చిదిద్దిన జిల్లా లయన్స్ మాజీ గవర్నర్ డాక్టర్ వై.జగన్‌మోహన్‌రావు మృతి సంస్థకు తీరని లోటని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. ఆదివారం ఏలూరులో మృతి చెందిన వై.జగన్‌మోహన్‌రావు భౌతికకాయానికి ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, తణుకు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ వంక రాజకుమారి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ మాట్లాడుతూ లయన్స్ సేవా సభ్యుడిగా పశ్చిమ, కృష్ణా జిల్లాల్లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి ఎంతో మందిని సేవా మార్గం వైపు నడిపించారన్నారు. ఐదు దశాబ్దాల పాటు వైద్య వృత్తిలో ఉండి, లయన్స్ సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. విశాఖపట్టణంలో లయన్స్ క్యాన్సర్ ఆసుపత్రి, విజయవాడలో బ్లడ్ బ్యాంక్ వంటివి ఆయన ఏర్పాటు చేశారన్నారు. ఏలూరు సీఆర్ఆర్ రెడ్డి కళాశాలల ప్రిన్సిపాల్ కలిదిండి అత్యుతరామరాజు, లయన్స్ నాయకులు పద్మావతి, ఎల్వీఆర్, తదితరులు నివాళులర్పించారు.

వరి వ్యర్థాలను తగలబెడితే భూమికి నష్టం



వరి మోడులను తగలబెట్టిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: వరి వ్యర్థాలకు నిప్పు పెట్టడం ద్వారా భూమిలోని సూక్ష్మ పోషకాలు నశించి, నష్టం వాటిల్లుతుందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ఖరీఫ్ వరి మాసూళ్లు పూర్తయ్యాయి. ప్రస్తుతం రైతులు ఎక్కువగా యంత్రీకరణ ద్వారా వరి కోతలను చేపడుతున్నారు. దీంతో వరి కంకులను కోయగా మిగిలిన మోడులు చేలల్లోనే ఉంటున్నాయి. అయితే రైతులు ఈ మోడులకు నిప్పు పెడుతున్నారు. భూమిలో ప్రధానంగా నత్రజని, భాస్వరం వంటి సూక్ష్మ పోషకాలు మెండుగా లభిస్తాయి. వరిమోడులను తగలబెట్టడం ద్వారా అవి భూమిలోనే నశిస్తాయి. ఇలా చేయడం కంటే ఆ మోడులను దుక్కిలో దున్నడం వల్ల అవి చివికి తదుపరి పంటకు పోషకాలుగా మారతాయని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. ప్రతి సీజన్‌లోనూ రైతులకు ఈ మేరకు అవగాహన కల్పిస్తున్నా అవేమీ పట్టడం లేదు. దీంతో మోడులకు నిప్పు పెడుతున్నారు. అయితే తదుపరి సీజన్‌కు మరలా పంట ఏపుగా, ఆరోగ్యంగా పెరగడానికి ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేస్తూ నేలను నిస్తేజంగా మారుస్తున్నారు. ఇలా చేయడం వల్ల భూమిలో ఎరువులు, పురుగు మందుల శాతం పెరిగి భావితరాల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని పలువురు శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

భూమి సహజత్వాన్ని పరిరక్షించాలి



ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి భూమి సహజత్వాన్ని పరిరక్షించాలి. వరి మోడులను తగలబెట్టకుండా దుక్కిలోనే దున్నాలి. దీని వల్ల భూమి సారవంతంగా మారుతుంది. తద్వారా ఎటువంటి ఎరువులు, పురుగు మందులు అవసరం లేదు. దుక్కిలో దున్నిన మోడుల ద్వారా సహజంగానే పంటకు కావలసిన పోషకాలు ఉత్పత్తి అవుతాయి.

– పి.మురళీకృష్ణ, వ్యవసాయ సహాయ సంచాలకులు, తాడేపల్లిగూడెం

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

పాలకొల్లు అర్బన్: విద్యారంగ సమస్యలను సీఎం చంద్ర బాబు పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి విషయాన్ని రాజకీయంగా ప్రచారం చేసుకోవడం అలవాటుగా మారిన చంద్రబాబు విద్యార్థుల తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన మెగా పేరెంట్స్ మీట్‌ను ప్రచారం కోసమే వాడుకున్నారని తేలిపోయిందని పేర్కొన్నారు. దిశా నిర్దేశం లేకుండా ఏమి ఆశించి ఆత్మీయ సమావేశాలు నిర్వహించారో? విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఏ ఫీడ్ బ్యాక్ తీసుకున్నారో చెప్పాలని ఆయన నిలదీశారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరుడి గ్రామోత్సవం



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



ఊరేగింపులో ఆకట్టుకున్న శక్తి వేషధారణలు

అత్తిలి: శ్రీవల్లీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి కల్యాణోత్సవాలలో భాగంగా శ్రీస్వామివారి ఊరేగింపు ఉత్సవం నేత్రపర్వంగా జరిగింది. బుట్టబొమ్మలు, బేతాళ నృత్యాలు, కోలాట భజనలు, రామదండు, కేరళా నృత్య ప్రదర్శనలు, తీన్‌మార్ డప్పులు, విచిత్ర వేషధారణలు, పలు బ్యాండు మేళాల నడుమ ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై శ్రీస్వామివారిని ఉంచి పలు వాహనాల నడుమ గ్రామోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. షష్ఠి ఉత్సవానికి జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు హాజరైతిలకించారు.

ఎమ్మెల్సీ వంక ప్రశ్నలకు లిఖితపూర్వక సమాధానాలు

తణుకు టౌన్: రాష్ట్రంలో పశు వైద్యశాఖలో నిర్వహిస్తున్న అంబులెన్స్ సర్వీసులు, నిర్వహణపై అసెంబ్లీలో తాను అడిగిన ప్రశ్నలకు సంబంధిత శాఖల నుంచి లిఖితపూర్వకంగా శనివారం సమాధానం అందినట్లు ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ ఆదివారం తెలిపారు. రాష్ట్రంలోని పశు సంవర్ధక శాఖలో ఎన్ని అంబులెన్స్‌లు ఉన్నాయి. వాటి ప్రస్తుత పరిస్థితి, నిర్వహణ ఏజెన్సీ, ఖర్చు వంటి వాటిపై అడిగిన ప్రశ్నలకు సమాధానం వచ్చినట్లు తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 340 పశు అంబులెన్సులు పని చేస్తున్నట్లు తెలిపారు. వాటి నిర్వహణకు గత సంవత్సరం జూన్ వరకూ రూ.49.48 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. ఇంకా రూ.87.74 కోట్లు చెల్లించవలసి ఉందని తన ప్రశ్నకు సమాధానంగా వచ్చినట్లు తెలిపారు.

నేడు గూడెంలో క్రిస్మస్ ర్యాలీ

పెంటపాడు: ఈ నెల తొమ్మిదో తేదీన యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ (యూపీఎఫ్) ఆధ్వర్యంలో క్రిస్మస్ పండుగ ర్యాలీ ఘనంగా నిర్వహించనున్నట్లు పాస్టర్ల సంఘ నాయకుడు మల్లిపూడి జైబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ర్యాలీ ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్న ఒంటి గంట వరకు నిర్వహిస్తారని, గూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. భాగ్యలక్ష్మీపేట ఎల్ఎల్ఎం చర్చి నుంచి గూడెం హౌసింగ్ బోర్డు వరకు తిరిగి ఎల్ఎల్ఎం చర్చి వరకు ర్యాలీ నిర్వహిస్తారని తెలిపారు.

మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలి



వైద్య అవగాహన శిబిరంలో పాల్గొన్న డైమండ్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ రాజశ్రీ అన్నారు. స్థానిక ఉమర్ ఆలీషా జ్ఞాన మందిరంలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్స్ డైరెక్టర్ డాక్టర్ దుర్గ ఆధ్వర్యంలో వైద్య అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా కో–ఆర్డినేటర్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆహారపు అలవాట్లు, తీసుకోవాల్సిన జాగ్రతలపై అవగాహన కల్పించారు. యోగా గురువు కరిబండి రామకృష్ణ, చెన్నారెడ్డి సతీష్, భాను సత్యనారాయణ, చిక్కాల అంబికా, మద్దుల సుభద్ర గుప్తా, కుందుం వెంకటేశ్వరరావు, అమల ధనలక్ష్మి, సుజాత, మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మూతపడ్డ మరుగుదొడ్లు



మరుగుదొడ్లకు తాళాలు వేసి ఉన్న దృశ్యం

అత్తిలి: బస్టాండ్‌లో మరుగుదొడ్లు శనివారం మూసివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అత్తిలిలో బస్టాండ్‌లో మాత్రమే మరుగుదొడ్డి సదుపాయం ఉంది. ప్రయాణికులతో పాటు స్థానిక వర్తక దుకాణదారులు బస్టాండ్‌లో ఉన్న మరుగుదొడ్డినే వినియోస్తుంటారు. అయితే మరుగుదొడ్లకు తాళాలు వేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ప్రస్తుతం అత్తిలిలో షష్ఠి తిరునాళ్లు నిర్వహిస్తున్న వేళ మరుగుదొడ్లను మూసివేయడంతో ముఖ్యంగా మహిళలు ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్‌లో మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. పంచాయతీ అధికారులు సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

11న జాబ్ మేళా

తణుకు టౌన్: శ్రీచిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 11వ తేదీన జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోక్‌మాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో భారత్ ఫైనాన్సియల్ సర్వీసెస్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ వంటి సంస్థలు పాల్గొంటాయన్నారు. తమ సంస్థలో ఫీల్డ్ అసిస్టెంట్లు, అసిస్టెంట్ సేల్స్ మేనేజర్లు, సేల్స్ ఆఫీసర్ల వంటి పోస్టులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు 20–30 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలని, కంపెనీ నియమ నిబంధనల ప్రకారం ఎంపిక చేసుకుంటారని తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ నెంబర్ 96185 60188లో సంప్రదించాలని కోరారు.

యోగా పోటీల్లో ప్రతిభ

పాలకొల్లు సెంట్రల్: ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరంలో నిర్వహించిన అంతర్ కళాశాలల యోగా పోటీల్లో విద్యార్థిని చెల్లూరి మాధవి ప్రతిభ కనబరచడం అభినందనీయమని డీఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ డా. శోభారాణి అన్నారు. ఆదివారం దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థిని మాధవిని అభినందించారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ శుక్రవారం నన్నయ్య యూనివర్శిటీలో జరిగిన పోటీల్లో యూనివర్సిటీ స్థాయిలో నాలుగో స్థానం సాధించిందన్నారు. ఈ నెల 24 నుంచి ఒరిస్సాలో కళింగ విశ్వవిద్యాలయంలో జరగనున్న జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా పీఈటీ లంకలపల్లి రమేష్, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థిని మాధవిని అభినందించారు.